# సాక్షి వరంగల్

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024


UPSC

## గోల్ పెట్టుకొని ప్రిపేరయ్యా..



జనగామలోని సెయింట్ పాల్స్‌లో ఏడో తరగతి చదువుకునే సమయంలోనే కలెక్టర్ కావాలనే లక్ష్యం పెట్టుకున్నా. అమ్మా, నాన్న ప్రోత్సాహం, చదువు నేర్పిన గురువుల సలహాలు, సూచనలతో ఇంతటి ఘనత సాధించా. మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించాలనే పట్టుదలతో అహోరాత్రులు కష్టపడి ప్రిపేరయ్యా. తల్లిదండ్రుల సహకారం, వారు పంచిన ప్రేమే 82వ ర్యాంకు వచ్చేలా చేసింది. ఎప్పుడు రిలాక్స్‌గానే ఉంటూ.. మైండ్‌లోకి ఏ ఆలోచనలూ రానివ్వకుండా ప్రిపేరయ్యాను. ఎంట్రెన్స్ రాసిన తర్వాత, మంచి ర్యాంకు వస్తుందని పెట్టుకున్న నమ్మకం నిజమైంది.

- మెరుగు కౌశిక్, 82వ ర్యాంకర్, జనగామ

## ప్రజా సేవ చేసేందుకు...



రైతులు, ప్రజలకు సేవ చేసేందుకు ఐఏఎస్ ఉద్యోగం ద్వారా ఎక్కువ అవకాశాలుంటాయని భావించి సివిల్స్ వైపు వెళ్లాను. గతంలో వచ్చిన ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికయ్యా. ఐఏఎస్‌కు ఎంపిక కావాలనే లక్ష్యంతో మరోసారి సివిల్స్‌కు హాజరయ్యా. ఈ సారి గతంలో కంటే మెరుగైన ర్యాంకు వచ్చింది. ఈ సారి ఐఏఎస్‌కు ఎంపికవుతాననే ఆశలున్నాయి. అవకాశం రాకపోతే గతంలో వచ్చిన ఐపీఎస్‌లో కొనసాగుతా.

- రావుల జయసింహారెడ్డి, 104వ ర్యాంకర్, హనుమకొండ

## ట్యూషన్లు చెబుతూ.. ప్రిపేర్ అవుతూ



సయింపు కిరణ్‌ది మధ్య తరగతి కుటుంబం. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ మరో వైపు యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఆన్‌లైన్‌లో ట్యూషన్లు చెప్పి సొంత ఖర్చులు వెళ్లదీసుకున్నారు. ఒకవైపు ప్రిపరేషన్.. మరో వైపు బోధన ఐపీఎస్ సాధించడంలో అనుకూలించాయి. ఆయన ఆన్‌లైన్ క్లాసులకు అటెండ్ అయిన పలువురు ఉన్నత ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

### చివరి ప్రయత్నంలో సాధించాను..

మన చేతిలో ఉన్న ప్రాసెస్‌ను గట్టిగా నమ్మితే విజయం సాధించడం సాధ్యం. ఆరోసారి చివరిగా నాకు ఇష్టమైన ఐపీఎస్ సాధించాలని విరామం లేకుండా ప్రతీ రోజు 5 నుంచి 6 గంటలు ప్రిపేరయ్యా. గంటల కొద్దీ చదవడం కంటే రోజూ కొంత సమయం కేటాయించి ప్రిపేరై విజయం సాధించా. సివిల్స్ రాయడానికి నాకు ఇంకో అవకాశం లేదు. చివరి ప్రయత్నంలో విజయం సాధించా.

- సయింపు కిరణ్, 568వ ర్యాంకర్, గీసుకొండ



# ఓరుగల్లు తేజాలు

### యూపీఎస్సీలో సత్తా చాటిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

- మొదటి ప్రయత్నంలోనే 82వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించిన కౌశిక్
- మరోసారి సత్తా చాటిన జయసింహారెడ్డి.. ఈసారి 104వ ర్యాంకు
- చివరి ప్రయత్నంలో రైతు బిడ్డ సయింపు కిరణ్‌కు 568వ ర్యాంకు
- శివనగర్ వాసి కొటే అనిల్‌కుమార్‌కు 743వ ర్యాంకు

ఏళ్ల తపస్సు. కఠోర శ్రమ. నిరంతర అభ్యాసం. అహోరాత్రులు చదువే ధ్యాస. శ్వాస పీల్చినా వదిలినా లక్ష్యమే మననం. ఆ లక్ష్యానికి ప్రేరణ కొందరికి తల్లిదండ్రులైతే.. మరికొందరికి విజయం సాధించిన వారి మాటలు. కొందరికి వారు పెరిగిన వాతావరణమైతే.. ఇంకొందరికి తాము ఎదుర్కొన్న ఇబ్బందులు.. ఫైనల్‌గా వారందరి లక్ష్యం ఒక్కటే పేదలకు సేవ చేయడం. అందుకనుగుణంగా వారు చివరి మెట్టు ఎక్కేశారు. గురిచూసి విజయాన్ని ఛేదించారు. ఇప్పుడు వారంతా మనం గర్వించేలా చెప్పుకునే ఉన్నతాధికారులు. యూపీఎస్సీలో సత్తాచాటిన ఓరుగల్లు తేజాలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు IIలో..


యూపీఎస్సీలో సత్తాచాటిన ఓరుగల్లు తేజాలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు IIలో..


- సాక్షి, వరంగల్/ గీసుకొండ/కాశిబుగ్గ/ హన్మకొండ/జనగామ/రఘునాథపల్లి

### సహనంతోనే లక్ష్య సాధన



నా తల్లిదండ్రులు పేదరికంతో అనేక కష్టాలు అనుభవిస్తూ చదివించారు. వారి ఇబ్బందులు నేను కళ్లారా చూశాను. మొదటి ప్రయత్నంలో 885వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్ శిక్షణలో ఉన్నా. అంకితభావం, కఠోర శ్రమ, సహనంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సులువే. ఇది నాకు అర్థమైంది. సాధించాను. 554వ ర్యాంకు వచ్చింది. ఐపీఎస్ వస్తుందనుకుంటున్నా.

- ప్రణయ్‌కుమార్, 554వ ర్యాంకర్, రఘునాథపల్లి

## న్యూస్‌రీల్

### షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలి

- ఏఎంఓ సారయ్య



**నెక్కొండ:** షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) సారయ్య సూచించారు. మండలంలోని పెద్ద కొర్పోలు కస్తూర్బా గురుకుల విద్యాలయం, స్థానిక హైస్కూల్, గౌతమి విద్యానికేతన్ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఏరోజు ప్రశ్నపత్రాలను ఆదేరోజు తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను లీక్‌చేస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 23 వరకు మూల్యాంకనం పూర్తి చేసి విద్యార్థులకు ప్రగతిపత్రాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీ భవనాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఎంఎన్ఓ రవికుమార్, హైస్కూల్ హెడ్‌మాస్టర్ రంగారావు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి



**నల్లబెల్లి:** ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలని జేడీఏ ఉషాదయాళ్ స్పష్టం చేశారు. మండలంలోని రేలకుంట, రంగాపూర్, నల్లబెల్లి, మేడపల్లి గ్రామాలను మంగళవారం ఆమె సందర్శించారు. ధాన్యం విక్రయించే సమయంలో పాటించాల్సిన ప్రమాణాలు, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువు, ఎరువులు,భూయాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉషాదయాళ్ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట జాతీయ ఆహార భద్రతా మిషన్ కన్సల్టెంట్ సారంగపాణి, వ్యవసాయాధికారి (టెక్నికల్) కృష్ణారెడ్డి, ఏఓ పరమేశ్వర్, ఏఈఓలు, రైతులు ఉన్నారు.


### ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి



**వరంగల్ అర్బన్:** భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమే అని జిల్లా స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా భవన్‌లో మంగళవారం స్వీప్ -2024 అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశయం పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటు హక్కు ప్రాధాన్యంపై టీపీఆర్వో కోలా రాజేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో నోడల్ అధికారి మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలక భూమిక పోషిస్తుందని, ప్రధానంగా యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ప్రజలు ఓటింగ్‌లో పాల్గొని పోలింగ్ శాతం పెంచేలా పట్టణ సమాఖ్యలు తమ వంతుపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం సమాఖ్య సభ్యులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో టీఎంసీ రమేశ్, సీఓలు నాగరాజు, శ్రీలత, రజిత, రమ, ప్రవీణ్, సఫియా, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సివిల్స్ ర్యాంకర్ కిరణ్‌కు అభినందనల వెల్లువ



**గీసుకొండ:** మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ సివిల్స్‌లో 568 ర్యాంకు పొంది ఐపీఎస్ సాధించాడు. దీంతో గ్రామంలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. పలువురు అధికారులు, నాయకులు కిరణ్, ఆయన తండ్రి ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. కిరణ్‌కు గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్ పూల మొక్క అందించి శుభాకాంక్షలు చెప్పారు.

# కలిసిన చేతులు కలవని మనసులు!

### ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో పాత, కొత్త నేతల మధ్య కుదరని సయోధ్య

- రెండు పార్లమెంట్‌ల పరిధిలో ఇదే పరిస్థితి.. కనిపించని సమన్వయం
- వలస నేతలతో కలిసిపోని కేడర్.. గ్రూపులు వీడని నేతలు
- సమన్వయ సమావేశాల్లో బయటపడుతున్న వర్గపోరు

**సాక్షిప్రతినిధి, వరంగల్:** అధికార కాంగ్రెస్ పార్టీని అంతర్గత కలహాలు వీడడం లేదు. గ్రూపు రాజకీయాలకు కేరాఫ్‌గా ఉండే ఆ పార్టీలో వర్గపోరు చల్లారడం లేదు. పదేళ్ల అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్.. ఈసారి అధికారంలో రావడంతో పార్టీలో చేరే కొత్తవారితో పాత కేడర్ మమేకం కాలేకపోతోంది. కష్టకాలంలో పార్టీలో కొనసాగిన నాయకులు, కార్యకర్తల మనోభావాలను ఎమ్మెల్యేలు పరిగణనలోకి తీసుకోకుండా ఇతర పార్టీల నుంచి పార్టీలో చేరిన వారికి పెద్దపీట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీనియర్లతో సంబంధం లేకుండానే పార్టీలో చేర్చుకోవడం.. బీఆర్ఎస్, బీజేపీలో కొనసాగిన సమయంలో కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను ఇబ్బంది పెట్టినవారిని చేర్చుకుని ప్రాధాన్యం ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వరంగల్, మహబూబాబాద్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహిస్తున్న సమన్వయ సమావేశాల్లో అంతర్గత కలహాలు, అసంతృప్తులు వెలుగుచూస్తుండడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం అవుతున్నాయి.

**చాపకింద నీరులా అసంతృప్తి.. 'సమన్వయం'లో బట్టబయలు..**

అధికారంలోకి రాగానే వలసలను ప్రోత్సహించడం పార్టీని నమ్ముకున్న కేడర్‌ను అసంతృప్తికి గురిచేస్తోంది. నిన్న మొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఢీ అంటే ఢీ అని పోరాడిన తమను జంప్ జిలానీలతో కలిసి నడవాల్సి రావడాన్ని జీర్ణించుకోవడం లేదు. ఇటీవల జరిగిన స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, పాలకుర్తి, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల సమన్వయ సమావేశాల్లో కార్యకర్తలు తమ అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు నిరసనలు, గలాటాకు దిగారు. వర్ధన్నపేటలో ఎమ్మెల్యే నాగరాజు గెలుపు కోసం సుమారు ఐదు నెలలు కష్ట పడి పనిచేశామని, అయినా తమను గుర్తించడం లేదని ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ప్రత్యేకంగా సమావేశమై ప్రకటన విడుదల చేశారు. ఆ మరుసటి రోజే నాగరాజుకు అనుకూలంగా మరోవర్గం ఆయన ఓడించాలని చూసిన ఓ వర్గం కుట్రగా ఆరోపించారు. మరోవైపు వరంగల్ తూర్పులో ఆధిపత్యపోరు సాగుతుండగా, పాలకుర్తి వివాదం గాంధీభవన్‌ను తాకింది. కొంతకాలంగా హనుమాండ్ల ఝాన్సీరెడ్డి విధానాలతో పొసగని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కొందరు అసంతృప్తిని వ్యక్తం చేస్తూ హైకమాండ్ వద్దకు వెళ్లారు. దేవరుప్పుల మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తిని తొలగించి నల్ల శ్రీరాములుకు బాధ్యతలు ఇవ్వడం రాజకీయదుమారాన్ని రేపుతోంది. స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి, కావ్య ఎంట్రీ సందర్భంగా ఏర్పడిన వివాదం సద్దుమణిగినట్లే కనిపిస్తున్నా.. ఇంకా చాపకిందినీరులా రగులుతోంది. హైకమాండ్ చొరవతో కడియం కావ్యకు మద్దతుగా సింగపురం ఇందిర కలిసిపోయినా.. ఇటీవల జరిగిన సమన్వయ సమావేశంలో పార్టీ నేతల మధ్యనే కార్యకర్తలు నిరసనలు, నిలదీతలకు దిగారు. ఇలా చాలాచోట్ల ఉన్న అసంతృప్తి తొలగించాల్సిన అవసరం ఉందన్న చర్చ ఆ పార్టీవర్గాల్లో సాగుతోంది.



పరకాలలో ఘర్షణపడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కొండా మురళి వర్గీయులు (ఫైల్)

### వీడని గ్రూపుల వార్.. హైకమాండ్ ఆరా..

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్‌ల పరిధిలో కాంగ్రెస్ నేతల మధ్య గ్రూపుల వార్ సాగుతోంది. పైకి అందరూ అందరితో బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా.. సందర్భం, అంశాలను బట్టి అది బయటకు వస్తోంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్‌కు పరకాల ఎమ్మెల్యే, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య సఖ్యత లేదన్న చర్చ ఉంది. ఇటీవల జరిగిన సమన్వయ సమావేశంలో రెండు వర్గాలకు చెందిన కార్యకర్తల గలాటే ఉదాహరణగా చెబుతున్నారు. వర్ధన్నపేటలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు మధ్య గ్రూపు వార్ సాగుతుందన్న చర్చ కూడా ఉంది. కడియం శ్రీహరి, కావ్య పార్టీలో చేరకముందు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ టికెట్ ఆశించిన పలువురు పార్టీ ప్రచారానికి కలిసి రావడం లేదని చెబుతున్నారు. పాలకుర్తి, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో కొత్త, పాత కేడర్‌ల మనుషులు కలిసినా మనసులు కలవలేదంటున్నారు.

- మహబూబాబాద్ పార్లమెంట్ విషయానికి వస్తే గిరిజనులకు రిజర్వు చేసిన నియోజకవర్గం. పూర్తిగా గిరిజన నేతలకు ప్రాధాన్యత కలిగి ఉంటుంది. ఈ పార్లమెంట్ పరిధిలో నర్సంపేట మినహా తక్కిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్టీలకు రిజర్వు చేసినవి. ఈ పార్లమెంట్ స్థానంలో అగ్రవర్ణాలకు చెందిన ముగ్గురు కీలక నేతలు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇద్దరు ప్రభుత్వ కీలక పదవుల్లో ఉండగా, ఒకరు మాజీ ఎంపీ కాగా.. ఎస్టీ సామాజికవర్గానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు దీన్ని జీర్ణించుకోవడం లేదు. ప్రజల చేత ఎన్నుకుని కీలకస్థానంలో ఉన్న తాము చీటికి మాటికి ఈ ముగ్గురి నేతల సూచనలను ఫాలో అయ్యే పరిస్థితిపై నొచ్చుకుంటున్నారన్న చర్చ సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో సత్ఫలితాలు రావాలంటే వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అగ్రనేతలు, ముఖ్యనేతలు, ఎమ్మెల్యేల మధ్యన ఇంకా సమన్వయం అవసరమని, గ్రూపులపై హైకమాండ్ ఆరా తీసినట్లు సమాచారం.

## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

- వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

**కరీమాబాద్:** నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేయాల్సిన బారికేడ్లు, పోలీసు బందోబస్తు, మీడియా పాయింట్ తదితర అంశాలపై మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ బారి, ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, డీఆర్వో శ్రీనివాస్‌తో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాలు, వీడియో ద్వారా చిత్రీకరించాలని, అభ్యర్థి ఆర్వో గదిలోకి ప్రవేశించగానే కనిపించేలా గడియారం ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి వంద మీటర్ల వరకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. డీపీఆర్వో అయూబ్ అలీ, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకుడు విశ్వనారాయణ, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీలు సహకరించాలి**

నామినేషన్ల ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు రూ.12,500, సాధారణ అభ్యర్థులు రూ.25,000 డిపాజిట్ చేయాలని, అభ్యర్థుల ఖర్చు రూ.95 లక్షలకు మించొద్దని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేయడానికి ముందే పోటీ చేసే అభ్యర్థి పేరు మీద ఏదైనా జాతీయ బ్యాంకులో కొత్తగా ఖాతా తెలరవాలని సూచించారు. అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. డీఆర్వో శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, రాజ్‌కుమార్, విశ్వనారాయణతోపాటు వివిధ పార్టీలకు చెందిన ఈవీ శ్రీనివాస్, నిహాల్, అమరేందర్, హరిశంకర్, నిశాంత్, నాగరాజు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఎదుట ధర్నా

**ఖానాపురం:** మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్ గేట్‌కు తాళం వేసి విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ధర్నా చేశారు. ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు పరీక్షలు నడుస్తున్నాయని ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి చెప్పడంతో తాళం తీసి ధర్నా విరమించారు. అనంతరం వినతిపత్రాన్ని ప్రిన్సిపాల్‌కు అందజేశారు. తల్లిదండ్రులు సింగు సుధాకర్, మోడెం ఎల్లగౌడ్, యోగానందచారి, శ్రీనివాస్, చందు, అశోక్, సంపత్, రమేష్, కిరణ్, కుమారస్వామి పాల్గొన్నారు.

**అధికారుల విచారణ**

బుధరావుపేట మోడల్ స్కూల్‌లో ఇటీవల ఓ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంఈఓ రత్నమాల, ఎంఎన్ఓ చరణ్‌సింగ్ మంగళవారం విచారణ చేపట్టారు. ఎమ్మార్సీ సిబ్బంది శ్రీధర్, సీఆర్పీ భాస్కర్ పాల్గొన్నారు.

**మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడి సస్పెన్షన్**

బుధరావుపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు డి.రాజేందర్‌ను సస్పెండ్ చేస్తూ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు హారిక ఈనెల 10న ఆత్మహత్యాయత్నం చేసుకుంది. అందుకు రాజేందరే కారణమని డీఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయమై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారులు ఉపాధ్యాయుడు రాజేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు

## పనులు అడ్డుకునే వారిపై చర్య తీసుకోవాలి

**ఖానాపురం:** ఉపాధి పనులు అడ్డుకునే వారిపై చర్య తీసుకోవాలని రాగంపేట కూలీలు మహేశ్, బీరయ్య, సాంబయ్య, రాధమ్మ, పద్మ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం వారు ధర్నా చేశారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసులు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. అనంతరం కూలీలు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ఉపాధి పనులు చేయన్వికుండా కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఆక్రమించుకున్న కోరెండులకుంట శిఖం భూముల్లో మట్టి పోస్తేనే పనుల వద్దకు ట్రాక్టర్లు వెళ్లనిస్తామని నిబంధనలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి కూలీలతో మాట్లాడారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు సమస్య వివరించగా చెరువు వద్దకు ఆర్ఐ, సిబ్బందిని పంపిస్తామని హామీ ఇచ్చారు. చెరువు వద్దకు ఆర్ఐ సత్యనారాయణ వెళ్లి పరిశీలించి త్వరలోనే సర్వేయర్‌తో హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కూలీలు స్వామి, వెంకన్న, రాజు, భిక్షపతి, కుమారస్వామి, రమేశ్, రాజమ్మ, కుమారస్వామి, జయమ్మ, యాదమ్మ, యలేంద్ర, సునీత పాల్గొన్నారు.




తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రాగంపేట ఉపాధి హామీ కూలీలు

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ

**దుగ్గొండి/ఖానాపురం:** వడదెబ్బ బాధితులకు సత్వరం చికిత్స అందించడానికి జిల్లా వ్యాప్తంగా 141 రెస్పాండ్ టీంలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. 7 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 118 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందించడానికి రెస్పాండ్ టీంలు సిద్ధంగా ఉంటాయన్నారు. దుగ్గొండిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తొగర్రాయిలోని ఆరోగ్య ఉప కేంద్రం, ఖానాపురం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తప్పకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఆయన వెంట దుగ్గొండి వైద్యాధికారి కిరణ్‌రాజు, సిబ్బంది సాంబయ్య, వెంకటరమణ, రహమాన్, సబిత, ఖానాపురం వైద్యులు జ్యోతి, రాకేష్, రుచిత, కల్పన, సిబ్బంది భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి, ఏఎన్ఎంలు విజయరాణి, సుజాత, జ్యోతి, రమాదేవి, భార్గవి, జ్యోతి, రమ, ఆశవర్కర్లు ఉన్నారు.



దుగ్గొండి పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ

## మొక్కజొన్న పంట దగ్ధం

**నర్సంపేట రూరల్:** షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన నర్సంపేట మండలంలోని పర్శనాయక్‌తండాలో మంగళవారం సాయంత్రం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పర్శనాయక్‌తండాకు చెందిన కొర్ర శోభన్‌కు 1.20 ఎకరాల భూమి ఉంది. పైన ఉన్న 11కేవీ తీగల నుంచి షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. దీంతో పంట మొత్తం కాలిపోయింది. అంతేకాకుండా రెండు బోరు మోటార్లు, పైపులైన్లు పూర్తిగా కాలిపోయాయని, వీటి విలువ సుమారు రూ.4.5 లక్షలు ఉంటుందని బాధితుడు రోదిస్తూ తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

## లా పరీక్షలో 11 మంది డీబార్

**కేయూ క్యాంపస్:** కేయూ పరిధిలో మూడేళ్ల లా కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ పట్టుబడిన 11 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.రాజారెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక పరిశీలించారు.

## లోబో కాయిన్ @రూ.25కోట్లు

- కాయిన్‌తో అద్భుత, అతీంద్రియ శక్తులంటూ మోసం..
- చివరికి పోలీసులకు చిక్కిన ముఠా..



పోలీసులు అరెస్ట్ చేసిన ముఠా

**రఘునాథపల్లి:** లోబో కాయిన్‌తో అద్వితీయ శక్తులు వస్తాయంటూ రూ.25కోట్లకు బేరమాడిన ముఠా జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీసులకు చిక్కింది మంగళవారం రాత్రి రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కింగ్ విలియమ్స్, వరంగల్‌కు చెందిన జాన్ బెంజిమెన్, నేరేడ్మెట్‌కు చెందిన జోసఫ్ సోలొమెన్‌సునీత్, మల్కాజగిరికి చెందిన రాజ్‌కుమార్, మూడు టెక్కులపల్లికి చెందిన షేక్ అక్బర్‌లు ముఠాగా ఏర్పడి ఓ వ్యక్తి వద్ద లోబో కాయిన్ కొనుగోలు చేశారు. కాయిన్ ఉన్న వ్యక్తికి అద్భుత, అతింద్రీయ శక్తులు వస్తాయని కోట్ల రూపాయలు సంపాదించడంతో పాటు ప్రపంచంలోనే ఎదురు లేని వ్యక్తిగా ఎదగొచ్చని హనుమకొండకు చెందిన రాజును నమ్మించారు. తమ వద్ద ఉన్న కాయిన్‌ను రూ.25 కోట్లకు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. వారం క్రితం లోబో కాయిన్ కొనుగోలుకు అంగీకరించిన రాజు రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మంగళవారం కాయిన్ రాజుకు ఇచ్చి మిగతా డబ్బు తీసుకునేందుకు వారు స్కార్పియొ వాహనంలో హనుమకొండకు వెళ్తున్నారు. కోమల్ల టోల్‌ప్లాజా వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసిన వారు వాహనాన్ని వేగంగా వెనక్కి తిప్పారు. అనుమానం వచ్చిన పోలీసులు ఆ వాహనాన్ని వెంబండించి పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకోగా లోబో కాయిన్ విషయం పోలీసులకు చెప్పారు. ముఠాకు చెందిన వాహనంతో పాటు, లోబో కాయిన్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.















## సివిల్స్‌లో సత్తా చాటిన పలువురు అభ్యర్థులు

- మొదటి ప్రయత్నంలోనే 82వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించిన కౌశిక్
- మరోసారి సత్తా చాటిన జయసింహారెడ్డి.. ఈసారి 104వ ర్యాంకు
- చివరి ప్రయత్నంలో రైతు బిడ్డ సయింపు కిరణ్‌కు 568వ ర్యాంకు
- శివనగర్ వాసి కొటే అనిల్‌కుమార్‌కు 743వ ర్యాంకు

# ఓరుగల్లు తేజాలు

యూపీఎస్సీలో ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు మెరిశారు. మొదటి ప్రయత్నంలోనే జనగామకు చెందిన కౌశిక్ 82వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో జిల్లాకు గౌరవ ప్రతిష్టలు తీసుకొచ్చారు. గతేదాది 217వ ర్యాంకు సాధించిన హనుమకొండకు చెందిన జయసింహారెడ్డి.. ఐఏఎస్ లక్ష్యంతో నాలుగో ప్రయత్నంలో గతంలో కంటే మెరుగ్గా 104వ ర్యాంకు సాధించారు. గీసుకొండ మండలం అనంతారంలో రైతు కుటుంబానికి చెందిన సయింపు కిరణ్‌కు 568వ ర్యాంకు వచ్చింది. వరంగల్ నగరం శివనగర్‌కు చెందిన కొటె అనిల్‌కుమార్ 743వ ర్యాంక్ సాధించారు. అయితే.. వీరిద్దరు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తూనే.. సివిల్స్‌కు ప్రిపేరై ర్యాంకులు సాధించారు. ముఖ్యంగా సయింపు కిరణ్‌కు ఐపీఎస్ వచ్చే అవకాశం ఉండగా.. కొటె అనిల్ కుమార్‌కు ఐఆర్ఎస్ వచ్చే చాన్స్ ఉంది. అయితే కోటి అనిల్ కుమార్‌కు ఐపీఎస్ కావాలనే కల ఉండదంతో చివరి అవకాశం ఆరోసారి సివిల్స్ రాసి ప్రయత్నిస్తారని అతడి తల్లిదండ్రులు అంటున్నారు.

सत्यमेव जयते

UPSC

## శివనగర్ వాసికి 743వ ర్యాంకు



సాక్షి, వరంగల్/ గీసుకొండ/కాశిబుగ్గ: యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో వరంగల్ నగరానికి చెందిన కొటె అనిల్‌కుమార్ 743వ ర్యాంకు సాధించారు. రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి కొటె కొమురయ్య, సరోజన దంపతుల కుమారుడు అనిల్. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు శివనగర్ రెనాల్డ్ స్కూల్, ఐదు నుంచి పది వరకు ప్లాటినం జూబ్లీ హైస్కూల్, ఇంటర్ విజయవాడ నారాయణ జూనియర్ కాలేజీలో చదివాడు. వరంగల్ నిట్‌లో ట్రిపుల్-ఈ చదివి హైదరాబాద్ ఎస్‌పీడీసీఎల్‌లో ఏఈగా మూడేళ్లు పని చేశారు. సివిల్స్ లక్ష్యంతో ఉద్యోగం వదిలేసి ప్రిపేర్ అయ్యారు. 2021 సివిల్స్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకుతో వెస్ట్ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పోస్టల్ ఎకౌంట్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ ఉద్యోగంలో చేరారు. ఎలాగైనా ఐపీఎస్ సాధించాలనే పట్టుదలతో గతేదాది సివిల్స్ రాయగా.. మంగళవారం విడుదలైన తుది ఫలితాల్లో అనిల్‌కుమార్‌కు 743వ ర్యాంకు వచ్చింది. 'నా కొడుకుకు ఐపీఎస్ కావాలన్నది బలమైన కోరిక. ఈసారి వచ్చిన ర్యాంకుతో ఐపీఎస్ వచ్చే అవకాశం చాలా తక్కువ. అందుకే మరోసారి (ఆరో సారి) ప్రయత్నించి తన కలను నెరవేర్చుకుంటాడు' అని అనిల్ తండ్రి కొమురయ్య తెలిపారు.

## సివిల్స్‌లో మెరిసిన జనగామ ఆణిముత్యం

- మొదటి ప్రయత్నంలోనే 82వ ర్యాంకు సాధించిన కౌశిక్



కుటుంబ సభ్యులతో కౌశిక్

**జనగామ:** యూపీఎస్సీ సివిల్స్ సర్వీస్ ఫలితాల్లో జనగామ జిల్లా కేంద్రం బాలాజీనగర్‌కు చెందిన విద్యార్థి అత్యుత్తమ ర్యాంకుతో సత్తా చాటుకున్నారు. మొదటి ప్రయత్నంలో 82వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో జిల్లాకు గౌరవ ప్రతిష్టలు తీసుకొచ్చారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త, బిల్డర్ మెరుగు సుజాత-సుధాకర్ దంపతుల కుమారుడు మెరుగు కౌశిక్ స్థానిక సెయింట్ పాల్ స్కూల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను పూర్తి చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ఉన్నత విద్యను పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసుకున్న కౌశిక్.. ఢిల్లీలోని ఐఏ ఎస్టీలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. మంగళవారం విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే 82వ ర్యాంకుతో రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచారు. కుమారుడు కలెక్టర్ కాబోతున్నాడనే ఆనందంలో తల్లిదండ్రులున్నారు. కొడుకు పడిన కష్టానికి ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సివిల్స్‌లో కౌశిక్‌కు ర్యాంకు వచ్చిన విషయం తెలుసుకున్న బాలాజీనగర్ రేణుక ఎల్లమ్మ గుడి కాలనీవాసులు అభినందనలు తెలిపారు.

### కల సాకారమైంది..

మా కొడుకు చిన్నప్పటి నుంచి చదువులో టాపర్. ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ రావాలనే కోరుకునే వాడు. మేం ఎప్పటికప్పుడు ప్రోత్సాహన్నిస్తూ.. కౌశిక్‌కు నచ్చినట్టు చదివించాం. సివిల్స్ ఎంట్రెన్స్ రాసే సమయంలో మొదటి ప్రయత్నంలోనే ఫలితం ఉంటుందని చాలా నమ్మకంతో చెప్పాడు. అదే నిజమైంది. కౌశిక్ కల సాకారమైంది. చాలా ఆనందంగా ఉంది.

\- తల్లిదండ్రులు మెరుగు సుజాత-సుధాకర్

## సివిల్స్‌లో మరోసారి సత్తా

### ఈసారి 104వ ర్యాంకు సాధించిన రావుల జయసింహారెడ్డి



కుటుంబ సభ్యులతో జయసింహా రెడ్డి

**హన్మకొండ:** సివిల్స్‌లో హనుమకొండకు చెందిన రావుల జయసింహా రెడ్డి మరోసారి అత్యుత్తమ ర్యాంకు సాధించారు. మూడో ప్రయత్నంలో గతేడాది సివిల్స్‌లో 217 ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఐఏఎస్‌కు ఎంపిక కావాలనే లక్ష్యంతో ఐపీఎస్ శిక్షణలో ఉన్న జయసింహా రెడ్డి సెలవుపై వెళ్లి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. నాలుగో ప్రయత్నంలో గతంలో కంటే మెరుగ్గా 104వ ర్యాంకు సాధించారు. రావుల జయసింహా రెడ్డి తండ్రి రావుల ఉమా రెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సహ పరిశోధన సంచాలకుడినిగా పనిచేస్తున్నారు. తల్లి లక్ష్మి గృహిణి. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటి వద్దనే ఉంటూ మూడు, నాలుగో ప్రయత్నంలో సివిల్స్ ర్యాంకు సాధించాడు. పాఠశాల విద్య 7వ తరగతి వరకు జగిత్యాలలో 8 నుంచి 10 వరకు హనుమకొండ ఎస్ఆర్ ఎడ్యు స్కూల్‌లో చదివారు. హైదరాబాద్ శ్రీ చైతన్య నారాయణలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యసించారు. అనంతరం రెండున్నల నెలల పాటు స్టార్టప్ కంపెనీలో ఉద్యోగం చేశారు. తర్వాత 2020 నుంచి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. మొదటి రెండు ప్రయత్నాలో ప్రిలిమ్స్ వరకు వెళ్లారు. మూడో ప్రయత్నం ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి 217వ ర్యాంకు సాధించాడు. నాలుగో ప్రయత్నంలో మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి 104 ర్యాంకు సాధించారు.

### ఎంతో సంతోషంగా ఉంది

మా కుమారుడు సివిల్ ర్యాంకు సాధించడంతో ఎంతో సంతోషంగా ఉంది. ఐఏఎస్ సాధించాలనే కోరిక బలంగా ఉంది. నాలుగో ప్రయత్నంలోనూ సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించారు.

\- తల్లిదండ్రులు రావుల లక్ష్మి, ఉమారెడ్డి

## ఐఎఫ్ఎస్ శిక్షణ పొందుతూనే 554వ ర్యాంకు



తల్లిదండ్రులతో ప్రణయ్‌కుమార్

**రఘునాథపల్లి:** రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్-లక్ష్మీ దంపతుల మూడో కుమారుడు ప్రణయ్‌కుమార్ యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో 554వ ర్యాంకు సాధించారు. గతేదాది మొదటి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో 885వ ర్యాంక్ సాధించి ఐఎఫ్ఎస్ శిక్షణలో ఉన్నారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతూ పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రణయ్‌కుమార్ నాగారంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. గజ్వేల్‌లో పాలిటెక్నిక్, కూకట్‌పల్లి జేఎన్టీయూలో బీటెక్ ఎలక్ట్రానిక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదివి గతేదాది సివిల్స్‌లో ర్యాంకు సాధించాడు. ప్రణయ్‌కుమార్‌కు సివిల్స్ ర్యాంక్ రావడంపై కుటుంబ సభ్యులు సంబురాలు చేసుకున్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఐపీఎస్ 'కిరణ'మే.. సిక్సర్ కొట్టాడు..



కుటుంబ సభ్యులతో కిరణ్

సాక్షి, వరంగల్/ గీసుకొండ/కాశిబుగ్గ: మిగిలింది ఒకటే బంతి.. విజయం సాధించాలంటే ధోనీలా సిక్సర్ కొట్టాలి.. సరిగ్గా అతడు అదే చేశాడు. ఐపీఎస్ సాధించాలని పట్టువదలని విక్రమార్కుడిలా కష్టపడి చదవి చివరి(ఆరో) ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో మెరుగైన ర్యాంక్‌తో ఐపీఎస్ రేసులో నిలిచారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారంలో రైతు కుటుంబానికి చెందిన సయింపు కిరణ్ యూపీఎస్సీ ఫలితాల్లో 568వ ర్యాంకు సాధించి సత్తా చాటారు.

### ఆనందంగా ఉంది..

మా కుమారుడికి సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు వచ్చినందుకు ఆనందంగా ఉంది. సమాజంలో పది మందికి ఉపయోగపడేలా మా కుమారుడు పని చేయాలి. మా కుటుంబానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నదే మా ఆకాంక్ష. అప్పుడే మాకు నిజమైన సంతోషం. ఏమైనా మా కుమారుడు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది.

\- ప్రభాకర్, జయలక్ష్మి, కిరణ్ తల్లిదండ్రులు

### ఇదీ నేపథ్యం..

గీసుకొండ మండలం అనంతారానికి చెందిన రైతు సయింపు ప్రభాకర్, జయలక్ష్మి దంపతుల కుమారుడు కిరణ్. చిన్నతనం నుంచి చదువుల్లో ముందుండే కిరణ్ పదో తరగతి వరకు మామునూరు నవోదయ విద్యాలయంలో చదివారు. గుంటూరులో భాష్యం జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. జేఈఈ అడ్వాన్స్‌లో 1,598 ర్యాంకు సాధించి ఐఐటీ ఢిల్లీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2017లో బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో రసాయన శాస్త్రం సబ్జెక్టు ప్రిపరేషన్ ప్రారంభించారు. ఢిల్లీలోనే కోచింగ్ తీసుకున్న తర్వాత సొంతగా నోట్స్ తయారు చేసుకుని ప్రిపేరయ్యారు. పలు మార్లు మెయిన్స్, ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. 2019, 2020లో ప్రిలిమ్స్ పూర్తి చేసి మెయిన్స్ రాశారు. సెకెండ్ అటెంప్ట్‌లో రెండు మార్కులతో ఇంటర్వ్యూ మిస్ అయ్యాడు. ఇదే క్రమంలో ఆయన యూపీఎస్సీ సీఏపీఎఫ్‌లో 15వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమాండెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. అలాగే ఎయిర్ పోర్ట్ అథారిటీలోనూ ఉద్యోగం సాధించినా వాటిలో చేరలేదు. ప్రస్తుతం ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఆంధ్రా సర్కిల్‌లో ఉన్నతోద్యోగం సాధించి శిక్షణలో ఉన్నారు.

# ప్రజాభీష్టం మేరకు పాలన

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- 19న సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి



వేదికను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

**మహబూబాబాద్ రూరల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు పాలన కొనసాగిస్తోందని రాష్ట్ర భారీ నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యాన శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్లమెంట్ నియోజవర్గ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ ఇన్‌చార్జ్, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భద్రాచలం రాములవారి దీవెనలతో 19వ తేదీన కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నామినేషన్ కార్యక్రమంతోనే కాంగ్రెస్ గెలుపు ఖాయం కావాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, నీటి వనరులను కూడా అస్తవ్యస్తం చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలలో చాలా వరకు అమలు చేశామని, ఆగస్టు 15వ తేదీ లోపు రైతులకు రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ సభాస్థలి ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీనాయక్, దొంతి మాధవరెడ్డి, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, నాయకులు సాదు రమేష్ రెడ్డి, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు నూనావత్ రాధా, నారోజు సత్య మనోరమ, చుక్కల ఉదయ్ చందర్, దేవరం ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యం

- ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి



మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి

**హన్మకొండ చౌరస్తా:** కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం ఉంటుందని, అందుకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్, ఇప్పుడు వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కావ్య నిదర్శనమని ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని 'డి' కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఎన్ఎస్‌యూఐ వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశం జరిగింది. ఎన్ఎస్‌యూఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రోహిత్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశానికి హాజరైన ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను చూస్తుంటే వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. దేశంలో విద్యారుణాలు బకాయిలు ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందజేస్తామన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దోపిడీ కంటే తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం చేసిందే ఎక్కువన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కావ్య మాట్లాడుతూ మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీని గద్దె దించి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలన్నారు. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర చందనారెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, నాయకులు రమకాంతారెడ్డి, అలువాల కార్తీక్, బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

# మారిన పరీక్ష ప్రశ్న పత్రం

- ఒక పేపర్‌కు బదులు మరొకటి..
- ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలో తప్పిదం
- కేయూ పరీక్షల విభాగంలో విద్యార్థుల ఫిర్యాదు



**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 15వ తేదీ నుంచి ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో హనుమకొండలోని యూనివర్సిటీరోడ్డులోని ఓ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో మొదటిరోజు ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ప్రశ్న పత్రం ఇచ్చారని పలువురు విద్యార్థులు మంగళవారం పరీక్షల విభాగం అధికారులుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15న మధ్యాహ్నం నిర్వహించిన మోడర్న్ ఫార్మా అనాలటికల్ టెక్నిక్స్ సబ్జెక్టు పేపర్-1లో ఐదు స్పెషలైజేషన్ పేపర్‌లున్నాయి. అయితే ఫార్మాస్యూటికల్ అనాలసిస్ అండ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ పేపర్ రాయాల్సిన 22 మంది విద్యార్థులకు ఆ పేపర్ ప్రశ్నపత్రానికి బదులు ఫార్మాస్యూటిక్స్, ఇండస్ట్రియల్ ఫార్మసీ, ఫార్మాకాలజీ, అండ్ ఫార్మాకాగ్నసీ పేపర్- 1 ప్రశ్న పత్రం ఇచ్చారని అధికారులకు వివరించారు. అయితే పరీక్ష జరిగిన సమయంలోనే ఆయా విద్యార్థులు సదరు కళాశాల ప్రిన్సిపాల్ (చీఫ్ సూపరింటెండెంట్)ను అడగ్గా.. ఇదే ప్రశ్నపత్రం అని సమాధానం చెప్పారని విద్యార్థులు మంగళవారం కేయూ అధికారులు తెలిపారు. యూనివర్సిటీ పరీక్షల విభాగం నుంచి పరీక్ష కేంద్రాలకు ఆన్‌లైన్‌లో ప్రశ్న పత్రాలను పంపిస్తారు. ఏ పేపర్ ఎంతమంది విద్యార్థులు రాస్తారనే సమాచారం ఉంటుంది. అలాంటప్పుడు ఆయా విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకున్నాక జిరాక్స్ తీసి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఏఏ విద్యార్థులు ఆయా స్పెషలైజేషన్ పేపర్లు రాస్తున్నారనేది కూడా సరిగా చూసుకోకుండానే ప్రశ్నపత్రం ఇచ్చారనేది స్పష్టమవుతుంది.

### ప్రిన్సిపాల్‌తో మాట్లాడా..

ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ మొదటి పేపర్ పరీక్షలో ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ఇచ్చారనే విషయం మా దృష్టి వచ్చింది. విద్యార్థులు ఫిర్యాదు చేయగా.. ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడా. విద్యార్థులు పరీక్ష సమయం ముగిసే సమయంలో అది తమ ప్రశ్న పత్రం కాదని చెప్పినట్లు ప్రిన్సిపాల్ సమాధానం ఇచ్చారు. కానీ, ముందే చెప్పినట్లు విద్యార్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రశ్నలపై ఫార్మసీ కాలేజీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌తో మాట్లాడి విద్యార్థులకు న్యాయం చేస్తాం. ఒక పేపర్‌కు బదులు మరోపేపర్ ఇచ్చిన వారికి నోటీస్ ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

\- నర్సింహాచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

# రైతులను మోసం చేస్తే సహించం

- మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్

**మహబూబాబాద్ రూరల్ :** వ్యాపారులు.. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. సరుకుల రాకపోకలు, ధరల నిర్ణయాలు, వ్యాపారులు ఏ విధంగా రైతులకు సహకరిస్తున్నారనే అంశాలను పరిశీలించామన్నారు. రైతుల అవసరాల మేరకు మార్కెట్ ప్రాంగణంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతు విశ్రాంతి భవనం, తాగునీరు ఏర్పాట్లు, మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతులు, ఇవి కాక అవసరం ఉన్న పనులను త్వరలో చేయించి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ప్రాంగణం వచ్చే సరుకుల అవసరం మేరకు సరిపోవడం లేదని గుర్తించామని, ఆదాయాన్ని బట్టి ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం నిర్ణయం తీసుకుని అభివృద్ధి పనులు చేపడుతాన్నారు. వ్యాపారులు మంచి ధర నిర్ణయించి సరుకులు కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకటరెడ్డి, ఏఎంసీ ఇన్‌చార్జ్ ప్రసాదరావు, సెక్రటరీ షంషీర్, సూపర్‌వైజర్ రమేష్, ఏఎంఎస్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

### REAL ESTATE

#### PLOTS FOR SALE

- Low Cost Plots for sale DTCP Apr. Layout లో అన్ని అనుమతులతో కూడిన 120. sq.yards కేవలం 7,20,000 మాత్రమే. (మార్కెటింగ్ సిబ్బంది కావలెను). సంప్ర॥ 9553182182. [W-1264933]
- భూపాలపల్లి టౌన్‌లోని స్వర్ణ కౌంటీ వెంచర్‌లో అత్యాధునికంగా అభివృద్ధి చేయబడిన 4 ప్లాట్లు అమ్మకానికి వున్నవి. సంప్ర॥ 9110551507. [W-1264959]
- GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును. గజం కేవలం 15,000/- మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264880]

#### HOUSE FOR SALE

- WGL, కొత్తవాడ లక్ష్మీగార్డెన్స్ దగ్గర 182 గ॥ల ఇల్లు గ్రౌండ్ ఫ్లోర్ 1 BHK+2 BHK, 1st ఫ్లోర్ 2 BHK+2 BHK, 2nd ఫ్లోర్, 1 BHK పార్కింగ్ గ్రౌండ్ ఫ్లోర్ 1-కార్ & 3 బైక్స్, 1 బోర్ WMC వాటర్. సెల్ : 97046 43450/ 96529 79107. [M-11633]

### SERVICES

- వరంగల్ నగరమందు పర్మిషన్‌తో కూడిన ప్లాట్లు & ఇండ్లు దొరుకును. నిరుద్యోగులకు గొప్ప అవకాశం కెనడా, ఆస్ట్రేలియా, వర్క్ విసా Helping Hand Seva Society ద్వారా ఉద్యోగం చేస్తూ EMI పద్ధతిలో చెల్లించవచ్చు. ఫోన్: 9014743326. [W-1264930]

#### బ్యూటీ పార్లర్

- మా శ్రీశైలి బ్యూటీపార్లర్‌లో బ్యూటీషీయన్, పర్సనల్ గ్రూమింగ్, నేయిల్ ఆర్ట్, బ్రైడర్ మెహెంది మొదలగు అన్ని కోర్సులు 5000కే నేర్పించబడును. మరియు మగ్గం వర్క్స్ కూడా నేర్పించబడును. సమ్మర్ ఆఫర్ తక్కువ ఫీజుతో నేర్పించబడును. సంప్ర॥ 9989060668. [W-1264934]

#### స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

- స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్‌కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్ద వారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. 8186926067, 8977263124. [W-1264881]

#### BUSINESS OFFER

- కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు. ✆ 89208 66865. [T-1252729]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

### WANTED

- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185032]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్సను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph:9160900024/9640400073 [H-799868]
- Hydలోని పేషెంట్లను, ముసలివారిని, వారి ఇంటి వద్దనే చూసుకొనుటకు ఆయాలు, వార్డ్ బాయ్స్, నర్సులు, కేర్‌టేకర్స్ కా॥. జీ : 10-25 వేలు. రూం + భో॥ ఫ్రీ. Ph: 9000638842, 9866605144 [HA-13644]

### WANTED TEACHERS

- A Well reputed school in HNK wanted Vice Principal & all faculty Pre-primary, Primary high school apply by mobile or mail detail (CV) Curriculum Vitae within 10days, edreddy1960@gmail.com. Cell: 9849413639, 6302616714. [W-1264958]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి బిజినెస్
బుధవారం
17-4-2024

| స్టాక్ మార్కెట్లు — దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 456 | 72,944 |
| నిఫ్టీ ▽ | 125 | 22,148 |

| విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 15,899 | △ 13 |
| డోజోన్స్ | 37,857 | △ 122 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,166 | △ 89 |
| డాక్స్ | 15,509 | △ 328 |
| షాంఘై | 3,007 | ▽ 50 |
| నికాయ్ | 38,471 | ▽ 762 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ (రూ.లలో) — ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 73,302 | △1,488 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 73,008 | △1,487 |
| వెండి (కిలో) | 83,213 | ▽ 239 |

| ఫారెక్స్ రేట్లు (రూ.లలో) | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎకటి | 83.04 | 84.06 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎకటి | 104.56 | 106.76 |
| € | యూరో | ఎకటి | 87.82 | 90.16 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎకటి | 53.77 | 54.97 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎకటి | 53.20 | 55.12 |
| S$ | సింగపూర్ డాలర్ | [illegible] | 59.26 | 63.40 |
| SAR | సౌదీ రియాల్ | [illegible] | 21.37 | 22.88 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | [illegible] | 21.84 | 23.58 |
| ¥ | చైనా యువాన్ | [illegible] | 10.40 | 12.38 |

## ఎంఎఫ్ ఆస్తులు రూ. 53.4 లక్షల కోట్లు

- 2023–24లో 35 శాతం జూమ్
- వార్షికంగా రూ. 14 లక్షల కోట్ల జమ
- 17.78 కోట్లకు ఫోలియోల సంఖ్య




**న్యూఢిల్లీ:** దేశీయంగా మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 35% జంప్ చేశాయి. రూ. 53.4 లక్షల కోట్లను తాకాయి. వార్షికంగా రూ. 14 లక్షల కోట్లమేర ఎగశాయి. ఇందుకు ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, లాభాల పరుగు తీస్తున్న ఈక్విటీ మార్కెట్లు ప్రభావం చూపాయి. వెరసి 2020–21 ఏడాది(41 శాతం వృద్ధి) తదుపరి గరిష్టస్థాయిలో ఎంఎఫ్ ఆస్తులు బలపడినట్లు వార్షిక నివేదికలో ఫండ్స్ దేశీ అసోసియేషన్(యాంఫీ) వెల్లడించింది. ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) పురోగతి.. ఫండ్స్ పరిశ్రమలో పెరుగుతున్న ఇన్వెస్టర్లను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా మార్చి చివరికల్లా ఫోలియోల సంఖ్య 17.78 కోట్లను తాకింది. ఇది సరికొత్త రికార్డు కాగా.. ఇన్వెస్టర్ల బేస్ 4.46 కోట్లకు చేరింది. ఇన్వెస్టర్ల సంఖ్యలో మహిళల వాటా 23 శాతంకావడం గమనార్హం!

**సిప్ దన్ను**

క్రమబద్ధ పెట్టుబడుల(సిప్) పథకాలను ఇన్వెస్టర్లు ఆదరిస్తుండటంతో వీటి సంఖ్య బలపడుతోంది. దీంతో నెలవారీ నికర పెట్టుబడులు మార్చిలో రూ. 19,300 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదిలో సిప్ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు లభించాయి. ఇది ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని పట్టిచూపుతోంది. అంతేకాకుండా క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులను ప్రతిబింబిస్తోంది. దేశీ ఎంఎఫ్ పరిశ్రమకు గతేడాది మైలురాయివంటిదని యాంఫీ నివేదిక పేర్కొంది. ఏయూఎం చెప్పుకోదగ్గవిధంగా రూ. 14 లక్షల కోట్లమేర పెరిగి సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 53.4 లక్షల కోట్లకు చేరినట్లు వివరించింది. 2022–23లో ఫండ్స్ ఏయూఎం విలువ రూ. 39.42 లక్షల కోట్లు మాత్రమేనని ప్రస్తావించింది. ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఆధారిత పథకాలు తదితరాలలో ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. పరిశ్రమ ఆస్తుల్లో వీటి వాటా 58 శాతంకాగా.. ఫోలియో సంఖ్యలో 80 శాతాన్ని ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఇవన్నీ ఎంఎఫ్‌ల ద్వారా క్యాపిటల్ మార్కెట్లలో పెరుగుతున్న కుటుంబ మదుపును ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేసింది.

**ఈక్విటీకే ఓటు**

గతేడాది పెట్టుబడుల్లో ఈక్విటీ ఆధారిత పథకాలు 55 శాతం వృద్ధిని అందుకుని ఆస్తులలో రూ. 23.5 లక్షల కోట్లకు చేరాయి. ఇందుకు పెట్టుబడులతో పాటు.. మార్క్‌టు మార్కెట్(ఎంటుఎం) లాభాలు సహకరించాయి. అయితే మరోవైపు రుణ పథకాల ఫండ్స్ 7 శాతమే బలపడ్డాయి. ఏయూఎంలో రూ. 12.62 లక్షల కోట్లకు చేరాయి. అయినప్పటికీ అంతక్రితం రెండేళ్లలో ఆస్తులు తగ్గుతూ వచ్చిన అంశంతో పోలిస్తే మెరుగేనని నివేదిక తెలియజేసింది.

# మూడోరోజూ పతనమే

- సెన్సెక్స్ 456 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత
- మూడు వారాల దిగువకు సూచీలు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు




**ముంబై:** పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలతో స్టాక్ సూచీలు మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ, మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 456 పాయింట్లు నష్టపోయి 72,944 వద్ద నిలిచింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 22,148 వద్ద స్థిరపడింది. ఇవి 3 వారాల కనిష్ట స్థాయిలు కాగా.. నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 715 పాయింట్లు నష్టపోయి 72,685 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు క్షీణించి 22,125 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఆయిల్, విద్యుత్, వినిమయ, పారిశ్రామిక, కన్జూమర్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు దాదాపు సగం నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.05% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,468 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, డీఐఐలు రూ.2,040 కోట్ల షేర్లను కొనుగోలు చేశాయి.

- ➤ శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- ➤ అమెరికా వడ్డీ రేట్ల వాయిదా అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్ 4%, ఎంఫసిస్ 3.50%, కోఫోర్జ్ 3%, పర్సిస్టెంట్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.
- ➤ వెల్త్‌మేనేజ్‌మెంట్, బ్రోకింగ్ కంపెనీల ఏర్పాటుకు బ్లాక్‌రాక్‌తో ఒప్పందం చేసుకోవడంతో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 2% లాభపడి రూ.362 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.372 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,733 కోట్లు పెరిగి రూ.2.30 లక్షల కోట్లకు చేరింది.
- ➤ సెన్సెక్స్ మూడు రోజుల్లో 2,094 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో మార్కెట్ విలువలో రూ.7.93 లక్షల కోట్లు మాయమ్యాయి.

### రికార్డు కనిష్టానికి రూపాయి

- 83.61కి దేశీ కరెన్సీ విలువ

డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ఉద్రిక్తతలతో ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ 5 నెలల గరిష్టానికి బలపడటం ప్రధాన కారణం. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 83.51 వద్ద మొదలైంది. రోజంతా నష్టాల్లో కదలాడి ఇంట్రాడే కనిష్టం(83.61) వద్ద స్థిరపడింది. ఈ ఏడాది మార్చి 22న ఇదే స్థాయి(83.61) వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. వెరసి గడిచిన నాలుగు వారాల్లో దేశీయ కరెన్సీ రెండోసారి జీవితకాల కనిష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

## మళ్లీ మెరిసిన పసిడి, వెండి

**బంగారం కొత్త రికార్డు రూ. 73,750**


పశ్చిమాసియాలో ఉద్రిక్తతల భయాలతో పసిడి, వెండి పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ధోరణులకు తగ్గట్టు దేశీయంగా వెండి, బంగారం ధరలు మంగళవారం మరో రికార్డు స్థాయిని తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ప్రకారం దేశ రాజధానిలో ఉదయం పసిడి 10 గ్రాముల ధర రూ. 700 పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి అయిన రూ. 73,750ని తాకింది. అదే విధంగా వెండి ధర కూడా కేజీకి రూ. 800 పెరిగి రూ. 86,500 స్థాయిని తాకింది. ఎంసీఎక్స్‌లో జూన్ కాంట్రాక్టు ధర ఇంట్రా–డేలో రూ. 72,927 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లు చూస్తే కామెక్స్‌లో ఔన్సు (31.1 గ్రాముల) పసిడి ధర 15 డాలర్లు పెరిగి 2,370 వద్ద ట్రేడయ్యింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినంత కాలం బంగారం బులిష్‌గానే ఉండనున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు.



| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| 17-4-2024 ఫామ్ ధర... | |
| విశాఖ | 419–00 |
| చిత్తూరు | 483–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 404–00 |
| విజయవాడ | 404–00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 405–00 |
| వరంగల్ | 407–00 |
| రిటైల్ ధర | 4.65 |

## క్రిసిల్ క్యూ1 లాభం డౌన్

**షేరుకి రూ. 7 డివిడెండ్**



**న్యూఢిల్లీ:** రేటింగ్ దిగ్గజం క్రిసిల్ ఈ ఆర్థిక సంవత్సరం(2024) తొలి త్రైమాసికం(క్యూ1)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చిలో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతంపైగా క్షీణించి రూ. 138 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలం(క్యూ1)లో రూ. 146 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 751 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో రూ. 732 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 539 కోట్ల నుంచి రూ. 563 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. గతేడాది(2023)కిగాను కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 14న డివిడెండ్ చెల్లించనుంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీడీపీ 6.8 శాతం వృద్ధిని సాధించవచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.

క్రిసిల్ షేరు 3% తగ్గి రూ. 4,700 వద్ద ముగిసింది.

## సోనీతో విలీనంపై జీ పిటిషన్ ఉపసంహరణ

**న్యూఢిల్లీ:** సోనీతో విలీన ప్రతిపాదన అమలయ్యేలా ఆదేశాలివ్వాలంటూ ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) ఉపసంహరించుకుంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్న ట్లు వివరించింది. షేర్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చే అవకాశాలను ఉపయోగించుకోవడంపై, సోనీపై ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడంపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. సోనీ భారత వ్యాపార విభాగం, జీల్ విలీనంపై కొన్నాళ్లుగా కసరత్తు జరిగినప్పటికీ ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే.

## జ్యువెలరీ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

- రూ. 5 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు
- ఏబీసీ డిజిటల్ సూపర్ యాప్ ఆవిష్కరణ



**ముంబై:** ఆదిత్య బిర్లా గ్రూప్ కొత్తగా జ్యువెలరీ రిటైల్ వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇందు కోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. మంగళవారం ఆదిత్య బిర్లా క్యాపిటల్ డిజిటల్ (ఏబీసీడీ) సూపర్ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ చైర్మన్ కేఎం బిర్లా ఈ విషయాలు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఈ మధ్యే పెయింట్స్ వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు, డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే మూడేళ్లలో 3 కోట్ల మంది పైగా కొత్త కస్టమర్లను చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు బిర్లా వివరించారు. ప్రస్తుతం రుణాలు, బీమా, అసెట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపార విభాగాల ద్వారా ఆదిత్య బిర్లా క్యాపిటల్ సుమారు 3.5 కోట్ల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. సూపర్ యాప్‌లో 22 ఉత్పత్తులు, సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

భవిత

సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్–2024 విద్యార్థులకు మాక్‌టెస్టులు.. ఈ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. ఇప్పుడే రిజిస్టర్ చేసుకోండి.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# జాబ్ పాయింట్

### ఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎస్ఎఫ్‌లో 4,660 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ), కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,660
- » **పోస్టుల వివరాలు:** సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)-452, కానిస్టేబుల్-4208.
- » **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, జమ్మూ–శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.
- » **అర్హత:** కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **వయసు:** 01.07.2024 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ప్రారంభ వేతనం:** నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400. కానిస్టేబుల్ పోస్టులకు 21,700
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష(సీబీటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.05.2024
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rpf.indianrailways.gov.in

### సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెంలో 327 ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్).. వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 327

**పోస్టుల వివరాలు**

- » **ఎగ్జిక్యూటివ్ కేడర్:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈ–ఎం), ఈ2 గ్రేడ్–42, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), ఈ2 గ్రేడ్–07.
- » **నాన్–ఎగ్జిక్యూటివ్ కేడర్:** జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ(జేఎంఈటీ), టీ–ఎస్ గ్రేడ్ సి–100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–09, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ (ఎలక్ట్రికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–24, ఫిట్టర్ ట్రైనీ, క్యాట్ 1–47,ఎలక్ట్రీషియన్ ట్రైనీ, క్యాట్ 1–98.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** గరిష్ట వయసు 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**04.05.2024
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scclmines.com

### ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు

ఇండియన్ ఆర్మీ 140 టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో 2025లో ప్రారంభమయ్యే కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30 (140వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు)
- » **కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
- » **అర్హతలు:** సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు లేదా కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **వయసు:** 01.01.2025 నాటికి 20–27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** అప్లికేషన్ల షార్ట్ లిస్టింగ్, స్టేజ్1, స్టేజ్ 2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో లెఫ్ట్‌నెంట్ ర్యాంకుతో షార్ట్ సర్వీస్ కమిషన్ లభిస్తుంది. శిక్షణ అనంతరం పర్మనెంట్ కమిషన్ ఇస్తారు.

**ముఖ్య సమాచారం**

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 09.05.2024
- » **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in/Authentication.aspx

# ఆర్థిక, గణాంక కొలువుల పిలుపు

- » మొత్తం 48 పోస్టులతో ఐఈఎస్/ఐఎస్ఎస్ నోటిఫికేషన్
- » రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- » ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

**కేంద్ర సర్వీసుల్లో ఉన్నత కొలువులు కోరుకునే యువతకు మరో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! యూపీఎస్సీ.. ఐఈఎస్, ఐఎస్ఎస్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా జూనియర్ టైమ్ స్కేల్‌తో.. పలు శాఖల్లో.. అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాలో కొలువుదీరొచ్చు!! ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ ఉన్నత స్థాయి పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో ఐఈఎస్, ఐఎస్ఎస్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..**

**ఐఈఎస్/ఐఎస్ఎస్**

ఐఈఎస్.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్. ఐఎస్ఎస్..ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల ఆర్థిక సంబంధ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు అవసరమైన నిపుణుల ఎంపికకు యూపీఎస్సీ ప్రతిఏటా నిర్వహించే పరీక్ష.. ఐఈఎస్/ఐఎస్ఎస్.

**మొత్తం 48 పోస్టులు**

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన ఐఈఎస్/ఐఎస్ఎస్–2024 నోటిఫికేషన్ ద్వారా రెండు విభాగాల్లో కలిపి మొత్తం 48 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు ఉన్నాయి.

**విద్యార్హత**

- ▪ **ఐఈఎస్:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉండాలి.
- ▪ **ఐఎస్ఎస్:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ లేదా ఈ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌గా పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- ▪ **వయసు:** 2024, ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

**రెండు దశల ఎంపిక ప్రక్రియ**

ఐఈఎస్, ఐఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో వేయి మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

**రాత పరీక్షలు వేర్వేరుగా**

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్ష ఐఈఎస్, ఐఎస్ఎస్ అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

**వెయి మార్కులకు ఐఈఎస్ రాత పరీక్ష**

ఐఈఎస్ రాత పరీక్ష ఆరు పేపర్లలో మొత్తం 1,000 మార్కులకు జరుగుతుంది. అవి.. పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్ 100 మార్కులు, పేపర్–3 జనరల్ ఎకనామిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 జనరల్ ఎకనామిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 జనరల్ ఎకనామిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.

**ఐఎస్ఎస్.. రాత పరీక్ష ఇలా**

ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1 జనరల్ ఇంగ్లిష్–100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్–100 మార్కులు, పేపర్–3 స్టాటిస్టిక్స్–1(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–4 స్టాటిస్టిక్స్–2(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–5 స్టాటిస్టిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 స్టాటిస్టిక్స్–4, 200 మార్కులకు ఉంటాయి. మొత్తం 1000 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్ 3,4 తప్ప మిగతా పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్ పేపర్లకు రెండు గంటలు, డిస్క్రిప్టివ్ పేపర్లకు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

**పర్సనల్ ఇంటర్వ్యూ**

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో చివరగా 200 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే.. రాత పరీక్షలో మార్కులు, ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

**ముఖ్య సమాచారం**

- ▪ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- ▪ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 30
- ▪ **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2024, మే 1 నుంచి 7 వరకు
- ▪ **పరీక్ష తేదీలు:** 2024, జూన్ 21 నుంచి
- ▪ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- ▪ **వెబ్‌సైట్:** www.upsc.gov.in

### రాత పరీక్షలో రాణించేలా

ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు అకడమిక్‌గా పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా కలిసొస్తుంది.

**జనరల్ ఇంగ్లిష్**

ఐఈఎస్, ఐఎస్ఎస్ రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. వొకాబ్యులరీని, రీడింగ్ కాంప్రహెన్షన్ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

**జనరల్ స్టడీస్**

ఈ పేపర్ కూడా రెండు సర్వీసులకు ఒకే మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. శాస్త్ర సాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారత దేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి.

**జనరల్ ఎకనామిక్స్-1**

ఇందులో రాణించడానికి సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్ కోసం లారెంజ్ వక్ర రేఖ, ఏంజెల్ సూత్రం, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్పకాల–దీర్ఘకాల వ్యయ రేఖలు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

**జనరల్ ఎకనామిక్స్-2**

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే పేపర్ ఇది. దీనికోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపైనా దృష్టి పెట్టాలి.

**జనరల్ ఎకనామిక్స్-3**

ఇందులో ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలు సమ్మిళితంగా ఉంటాయి. ఈ పేపర్‌లో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ తదితర అంశాలపై అవగాహన పొందాలి.



ఐఈఎస్, ఐఎస్ఎస్-2024

**ఇండియన్ ఎకనామిక్స్**

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ–రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

**సబ్జెక్ట్ పేపర్లకు సన్నద్ధత ఇలా**

- ▪ స్టాటిస్టిక్స్–1 పేపర్‌లో రాణించాలంటే.. పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- ▪ స్టాటిస్టిక్స్–2 పేపర్‌లో.. లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్(ఎస్టిమేషన్ ఆఫ్ మీన్ వెక్టార్ అండ్ కో వేరియన్స్ మ్యాట్రిక్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- ▪ స్టాటిస్టిక్స్–3 పేపర్‌లో.. శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- ▪ స్టాటిస్టిక్స్–4 పేపర్‌లో.. స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్ ,డెమొగ్రఫీ అండ్ వైటల్ ఛార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్–సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై పట్టుసాధించాలి.
- ▪ డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ పేపర్లలో మంచి స్కోర్ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు, వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్, గ్రాఫ్స్ రూకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.